క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేసిన దవులూరి దొరబాబు

సామర్లకోట: ఆపదలో ఉన్న పేదలను ఆదుకునేందుకు విడుదల చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శనివారం స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గంలో 15 మంది లబబ్ధిదారులకు రూ.10.16 లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, ఎంపీపీలు పెంకే సత్యవతి, బొబ్బరాడ సత్తిబాబు, పట్టణ సచివాలయ కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, నవర సొసైటీ డైరెక్టరు నాగనబోయిన రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాల స్వీకరణ



మున్సిపల్ హైస్కూల్‌లోని పోలింగ్ బూత్‌లో ఓటర్ల స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించిన ఆవాల లక్ష్మీనారాయణ

సామర్లకోట: బీఎల్‌ఓలు శనివారం ఓటర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ బూత్‌ల్లో ఓటర్ల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ మేరకు ఓటర్ల బాబితాలో పేర్లు లేకపోవడం, పేర్లు తప్పుగా నమోదు కావడంపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ స్థానిక యార్లగడ్డ అక్కి రాజు మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఓటర్ల స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. ఈ మేరకు పోలింగ్ బూత్ పరిధిలో వచ్చిన ఫిర్యాదులపై వివరాలు సేకరించారు. వీఆర్వో లు, మహిళా పోలీసులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఆర్డీఓ



వీకే రాయపురంలోని పోలింగ్ బూత్‌ను పరిశీలించిన పెద్దాపురం ఆర్డీఓ

సామర్లకోట: వీకే రాయపురం పోలింగ్ బూత్‌లను పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు తనిఖీ చేశారు. ఓటర్ల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా పోలింగ్ బూత్‌లను పరిశీలించి ఆయా బూత్‌లలో బీఎల్‌ఓల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ఓటరు నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి నమోదు చేసుకోవాలన్నారు.

ఈవీఎంలపై ప్రజలకు అవగాహన

పెద్దాపురం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పెద్దాపురం మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఈవీఎంల పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల పరిషత్ సీనియర్ సహాయకులు జగన్నాథం, మహేష్ కార్యాలయ ఆవరణలో ఓటు ప్రక్రియ, ఈవీఎంల పనితీరు, ఓటు వేసే విధానం, ఎన్నికల నియమావళిపై డెమో ద్వారా అవగాహన కల్పించారు. పట్టణంలోని ఓటర్లందరూ అవగాహనా కేంద్రం వద్దకు వచ్చి ఈవీఎంపై ఓటు వేసే విధానంపై మరింత అవగాహన ఏర్పర్చుకోవాలని జగన్నాథం కోరారు.

శృంగార వల్లభుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: తొలి తిరుపతిగా ఖ్యాతికెక్కిన స్వయంభూ శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ చైర్మన్ కర్రి వెంకటజగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టారు. ఆలయంలో టిక్కెట్లు, అన్నదానం, కేశఖండన శాఖ ద్వారా రూ.4,13,559 ఆదాయం సమకూరినట్టు ఈఓ తెలిపారు. దాతలకు ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాలను అందజేశారు. సుమారు పది వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

7న పెద్దాపురం మండల పాస్టర్ల ఐక్య క్రిస్మస్

పెద్దాపురం: ఈ నెల 7వ తేదీన స్థానిక లూథరన్ హైస్కూల్ క్రీడా మైదానంలో పెద్దాపురం మండల పాస్టర్ల వెల్ఫేర్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ ఆరాధన నిర్వహించనున్నట్టు అసోషియేషన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నంగిన శామ్యూల్ సుదీప్, జీవీ రత్నం శనివారం విలేకర్లకు తెలిపాఉ. సాయంత్రం ఆరు గంటలకు క్రిస్మస్ ఆరాధన ప్రారంభమవుతందన్నారు. ప్రముఖ దైవజనులు, రాజమహేంద్రవరం రాక్ చర్చి ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు పి.జాన్ లాజరస్ దైవ ప్రసంగాన్ని అందిస్తారన్నారు.



కొండెవరంలో బరకాల్లో భద్రంగా ఉన్న ధాన్యం



ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న రైతులు



పంటను యంత్రంతో కోస్తున్న అన్నదాత

మిచాంగ్ అలర్ట్

- అధికారులు అప్రమత్తం
- ఒడ్డుకు చేరుతున్న మత్స్యకారులు
- ఇంకా సముద్రంలోనే బోట్లు, మత్స్యకారులు
- ఒడ్డుకు చేరుకోవాలని అధికారుల హెచ్చరికలు
- ఉప్పాడలో ఉప్పొంగుతున్న సముద్రం

పిఠాపురం: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారి తుపానుగా మారుతుందని కోస్తాతీరం వెంబడి భారీ వర్షాలు, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో స్థానిక యంత్రాంగం అప్రమత్తమైంది. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని, ఇప్పటికే వేటలో ఉన్నవారు ఒడ్డుకు చేరుకోవాలని హెచ్చరికలు జారీ చేశారు. శనివారం సాయంత్రానికి పలు బోట్లు ఒడ్డుకు చేరుకోగా ఇంకా కొన్ని సముద్రంలోనే ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. వారంతా ఆదివారం ఉదయానికి ఒడ్డుకు చేరుకునే అవకాశం ఉందంటున్నారు.

సురక్షిత ప్రాంతాలకు బోట్లు..

మత్స్యకారులు బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. శుక్రవారం రాత్రి నుంచి వారు చేపల వేటను నిలిపివేయగా, వేటలో ఉన్న బోట్లు ఒకొక్కటిగా ఒడ్డుకు చేరుకుంటున్నాయి.

ఉప్పొంగుతున్న సముద్రం

తుపాను ప్రభావంతో ఉప్పాడ తీరంలో సముద్రం ఉప్పొంగుతోంది. బలమైన ఈదురు గాలులకు చెట్లు విలవిలలాడుతుండగా తీరం వెంబడి ఉన్న మత్స్యకారులు ఇళ్లలో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. సముద్రం ప్రశాంతంగానే ఉన్నప్పటికీ సుమారు 5 మీటర్ల వరకు వెనక్కి వెళ్లడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. మామూలు సమయాల్లో సముద్రం ఒడ్డునే లంగరు వేసి ఉంచే బోట్లను ఒడ్డుకు లాక్కుని వస్తున్నారు. ఆదివారం ఉదయానికి వాయుగుండం తీవ్ర రూపం దాల్చి తుపానుగా మారే సమయంలో సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉందంటున్నారు.

రైతులు అప్రమత్తం

ఈ ఏడాది ఖరీఫ్ ఆశాజనకంగా పండడంతో ధాన్యం బారీగా కళ్లాల్లో ఉంది. విక్రయాలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో తుపాను హెచ్చరికలతో రైతులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే 70 శాతం వరి కోతలు పూర్తిగా కాగా మిగిలిన కోతలను ఈనెల 7వ తేదీ వరకు వాయిదా వేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించడంతో కోతలు నిలిచిపోయాయి. కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకుంటుండగా ఆర్బీకే సిబ్బంది రైతులకు సూచనలు ఇస్తున్నారు.

వడివడిగా ఒబ్బిడిగా..

కొత్తపల్లి: తుఫాన్ హెచ్చరికలతో రైతులు పండించిన పంటను ఒబ్బిడి చేసుకుంటున్నారు. పంటను యంత్రాల ద్వారా కోస్తున్నారు. కోసి ఉన్న పనలను పనకట్టు కట్టి రక్షిత ప్రాంతానికి తరలించి కుప్పలు వేస్తున్నారు. నూర్చిన ధాన్యాన్ని బరకాలతో భద్రపరుస్తున్నారు.



ఉప్పాడలో ఉప్పొంగుతున్న సముద్రం

కూలుతున్న మత్స్యకార గృహాలు

కొత్తపల్లి: తుపాను ప్రభావంతో మండలంలోని తీరప్రాంతం కడలి కల్లోలంగా మారింది. ఉప్పాడ, కోనపాపపేట తీరప్రాంతాల్లోని అలలు ఎగసిపడి ఇళ్ల కోతకు గురవుతున్నాయి. రక్షణగా గోడ రాళ్లు అలల తాకిడికి గ్రామంలోకి వచ్చి పడ్డాయి. కెరటాల తాకిడికి ఉప్పాడ–కాకినాడ బీచ్ రోడ్డు కోతకు గురైంది.

తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం

తీరప్రాంత మత్స్యకారులతో పాటు ప్రజలను అప్రమత్తం చేశాం. గ్రామాల్లో టాంటాం వేయించి మత్స్యకారులు ఎవరు చేపల వేటకు వెళ్లకుండా ఆదేశాలు జారీ చేశాం. రెవెన్యూ అధికారులతో తీరంలో గస్తీ ఏర్పాటు చేస్తున్నాం. పరిస్థితి ప్రమాదకరంగా మారితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

– ప్రసాద్, తహసీల్దారు, కొత్తపల్లి



ఉప్పాడ తీరంలో బంగారం కోసం వెతుకుతున్న మత్స్యకార మహిళలు

తీరంలో 'పసిడి' వేట

కొత్తపల్లి: ఉప్పాడ శివారు పాత మార్కెట్ సమీపంలోని తీరప్రాంతంలో మత్స్యకారులు పసిడివేట సాగిస్తున్నారు. కొందరు మహిళలకు బంగారు రేణువులు, రూపులు, దుద్దులతో పాటు పలు బంగారు, వెండి వస్తువులు లభ్యమయ్యాయి. గతంలో పెద్దపెద్ద బంగ్లాలు, పలు దేవాలయాలు సముద్ర గర్భంలో కలిసిపోయాయని, వాటిలో ఉన్న వస్తువులు ఈ సమయాల్లో బయటపడుతున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు. అధికారులు మాత్రం ఇది ప్రమాదకరమని సూచిస్తున్నారు.

పరిపాలనలో రికార్డు సృష్టించిన సీఎం జగన్

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు



బ్రహ్మానందపురం కార్యక్రమంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు అందజేయడం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రికార్డు సృష్టించారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. రెండో విడత ఇళ్ల స్థలాల కేటాయింపులో భాగంగా పి.వేమవరం, గొంచాల గ్రామాల్లో లబ్ధిదారులకు శనివారం బ్రహ్మానందపురం లేఅవుట్‌లో ప్లాట్లను చూపించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రజా సంకల్ప యాత్రలో 25 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తానని హామీ ఇచ్చి 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి దేశంలో రికార్డు సాధించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇల్లు నిర్మించుకునేందుకు రూ.1.80 లక్షల ఆర్థిక సాయం చేశారన్నారు. దాంతో ఆయా ప్రాంతాలు ఊళ్లుగా మారుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యేలకు టిక్కెట్లు కేటాయింపులో భాగంగా మొట్టమొదటి టిక్కెట్టు తనకే ఇచ్చారని, తాను పెద్దాపురం నియోజకవర్గం నుంచి స్థానికునిగా పోటీ చేస్తున్నానని దొరబాబు తెలిపారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డి రెండో పర్యాయం ముఖ్యమంత్రి కావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిశెట్టి అమృత, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, గ్రామ సర్పంచులు ఎలిశెట్టి నూకరత్నం, చోడిశెట్టి వెంకటరమణ, వైఎస్ ఎంపీపీ పేర్నిడి వెంకట్రాయుడు, ఎంపీటీసీ కేశవరపు వీరమణి, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కర్రి బుజ్జి, పార్టీ నాయకులు చోడిశెట్టి చినజోగారావు, ఎలిశెట్టి భీమన్నదొర, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్

సామర్లకోట: క్రైస్తవ దైవ జనులు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కోసం ప్రార్థనలు చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండల పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉజ్జీవ మహాసభలు ముగింపు కార్యక్రమంలో శుక్రవారం రాత్రి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆనందోత్సవాల మధ్య ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా ముగిసాయి. ప్రముఖ క్రైస్తవ సువార్త వర్తమానికులు జీఆర్ ఇమ్మానుయేలురాజు క్రిస్మస్ సందేశం ఇచ్చారు. మండల పరిధిలోని వివిధ చర్చిలకు చెందిన యువత నిర్వహించిన గీతాలాపన, సంగీత విభావరి ఎంతగానో అలరించింది. మండల ఫాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బి.దానియేల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, క్రిస్టియన్ మైనార్టీ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ దొమేటి సోనిమేరియ, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ క్రిస్టియన్ మైనార్టీ కోఆప్షన్ సల్లూరి కల్యాణ్ తదితరులు కేక్ కట్టింగ్ చేశారు. 2024కు సంబంధించి మండల ఫాస్టర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ మేరకు దవులూరి దొరబాబుతో పాటు ముఖ్య అతిధులను మండల పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించండి



రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించిన ఆర్డీఓ కిషోర్ తదితరులు

కాకినాడ ఆర్డీఓ కిషోర్

సామర్లకోట: తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్ అన్నారు. మండల పరిధిలో వివిధ గ్రామాల్లో రోడ్లపై పొలాలోను ఆరబెట్టిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ మేరకు వేట్లపాలెం రైసు మిల్లులను తనిఖీ చేసి రైతులకు అవసరమైన సహాయ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రైతులకు అందజేయడానికి అవసరమైన స్థాయిలో గోనె సంచులు రైతు భరోసా కేంద్రాలకు అందజేయాలన్నారు. రైతులు తీసుకొని వచ్చిన ధాన్యం వెంటనే తీసుకోవాలన్నారు.రైతు భరోసా కేంద్రాలను సందర్శించి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ఆరా తీశారు. పంట సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులను ఆదేశించా రు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ధాన్యం విక్రయించడానికి రవాణా చార్జీలు, హామాలిస్ చార్జీలు ప్రభుత్వం చెల్లించడం జరుగుతుందని ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్‌ఎల్‌వీ కుమారి, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ కీర్తి, వీఆర్వోలు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం



షష్ఠి ఉత్సవానికి పందిరి రాట వేస్తున్న కమిటీ సభ్యులు

పెద్దాపురం: చదలాడ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా శనివారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 8.51గంటలకు స్వామి వారి షష్ఠి ఉత్సవాలకు ముహూర్తపు రాట నిలబెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ నాయకులు కోడిగుడ్డు త్రిమూర్తులు, తాడాల ఏసుబాబు, కర్నీడి సురేష్ మాట్లాడుతూ షష్ఠి ఉత్సవాలు ఐదు రోజుల పాటు జరగనున్నాయని, భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలన్నారు. ఈ నెల 18వ తేదీన షష్ఠి రోజున ఏలేరు నదిలో భక్తులు స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రపాటి వీరబాబు, బత్తుల సీతారామయ్య, కోట శ్రీనివాసరావు, రెడ్నం సూరిబాబు, లయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యమైన మనసుతో..

- విభిన్న ప్రతిభా వంతులను కన్నబిడ్డల్లా సాకుతున్న సత్య వీరబాబు
- 150 మందికి ఆశ్రయమిచ్చిన శాంతి వర్ధన పాఠశాల
- నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

పెద్దాపురం: కన్నబిడ్డలను కంటికి రెప్పలా చూడడం తల్లిదండ్రుల బాధ్యత. వారికి మనం జన్మనిచ్చాం కాబట్టి.. తల్లిదండ్రులను కన్నబిడ్డల్లా చూడడం మన ధర్మం. ఎందుకుంటే వారు మనకు జన్మనిచ్చారు కాబట్టి.. అయితే ఒకరిద్దరు బిడ్డలను సాకాలంటేనే ఎన్నో వ్యయప్రయాసలు పడుతున్న ఈ రోజుల్లో సుమారు 150 మంది దివ్యాంగులు, మానసిక వ్యాధితో బాధపడుతున్న చిన్నారులను(విభిన్న ప్రతిభా వంతులు) తల్లిలా ఆదరించి, తన తాళిబొట్టును సైతం తాకట్టు పెట్టి వారి ఆకలి తీర్చిన అమ్మానాన్నలుగా సేవలందిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు 'శాంతి వర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల నిర్వాహకులు రాయవరపు వీరబాబు, సత్య దంపతులు.

పెద్దాపురం మండలం తిరుపతి గ్రామానికి చెందిన రాయవరపు వీరబాబుకు చిన్నతనంలోనే ఓ కాలికి పోలియో సోకింది. దీంతో వీరబాబుకు మనసులో తనలా వికలాంగత్వంతో బాధపడే వారి కోసం ఏదైనా చేయాలని అనుకునేవాడు. అతని భావాలు, ఆలోచనలు నచ్చి కంప్యూటర్ విద్యార్థిని సత్య వీరబాబును పెళ్లిచేసుకుంది. భర్త ఆశయాన్ని విని తాను కూడా చేదోడు వాదోడుగా నిలవాలనుకుంది. ఇద్దరు కలిసి శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాలను 2006లో పెద్దాపురం మండలం చంద్రమాంపల్లిలోని ఓ పాత వీడియో థియేటర్‌లో ముగ్గురు పిల్లలతో ప్రారంభించారు. ఇప్పుడు అది సుమారు 150 మందికి పైగా పిల్లలకు ఆశ్రయించే స్థాయికి ఎదిగింది. పాఠశాల ప్రారంభంలో దివ్యాంగ బిడ్డలకు కడుపునిండా తిండి పెట్టేందుకు ఇంట్లో ఉన్న ఒక్కో వస్తువునూ తాకట్టు పెట్టేవారు. ఒకానొక సమయంలో చివరకు సత్య తన తాళిబొట్టును కూడా తాకట్టు పెట్టి సొమ్ము తెచ్చి చిన్నారుల ఆకలిని తీర్చింది. ఆ చిన్నారులకు దారి చూపి తల్లి అయ్యింది.

విద్యా బుద్ధులు నేర్పుతూ..

మండలంలోని చదలాడ రోడ్డులోని పులిమేరు మెయిన్‌రోడ్డుకు ఆనుకుని ఉన్న ఓ కొబ్బరి తోటను లీజుకు తీసుకుని అక్కడే పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో జిల్లాలోని తుని, కిర్లంపూడి, ఏలేశ్వరం, శంఖవరం, విశాఖజిల్లా పాయకరావుపేట తదితర గ్రామాలకు చెందిన మానసిక వికలాంగులు ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. వీరందరికీ ఫిజియోథెరపీతోపాటు విద్యాబోధన సాగిస్తున్నారు. మానసిక ప్రతిభావంతులైన పిల్లలకు ఆట బొమ్మల ద్వారా అక్షరాలు, అంకెలు నేర్పిస్తున్నారు. నడవలేని చిన్నారులకు చంక కర్రలు, మూడు చక్రాల రిక్షాలు సమకూర్చడం, ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరాలు, 104, 108 సేవలు అందిస్తున్నారు

ప్రముఖుల సందర్శన

ఈ పాఠశాలను రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సోదరీ షర్మిలారెడ్డి, మెగాస్టార్ చిరంజీవి వంటి పలువురు ప్రముఖులు గతంలో సందర్శించారు. పలు సందర్భాల్లో జిల్లాకు వచ్చిన వారు పాఠశాలను సందర్శించి చిన్నారుల యోగక్షేమాలు అడిగి తెలుసుకునేవారు.



విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు గోరుముద్దలు తినిపిస్తున్న సత్య

బాధ లేదు



మాది పిఠాపురం మండలం మంగుతుర్తి 13 ఏళ్ల కిందట గ్రామంలో అందరూ కుంటోడు అంటూ ఏడిపించేవారు. ఎంతో ఏడ్చాను. అప్పుడే ఈ పులిమేరు పాఠశాలలో మా అమ్మానాన్న చేర్పించారు. గ్రామంలో పేద కుటుంబం కావడంతో ఇక్కడ చేరాను. తరువాత కనీసం అంగవైకల్యం ఉందన్న ధ్యాస లేకుండా బాధ లేదు. ఆనందంగా గడుపుతున్నాను.

–మారే సత్తిబాబు, వికలాంగ విద్యార్థి, మంగుతుర్తి, పిఠాపురం మండలం

నాలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదు



నాకు చిన్నప్పటి నుంచే ఆ దేవుడు కళ్లునివ్వలేదు. నా తండ్రి చనిపోవడంతో కుటుంబ సభ్యులకు భారం అయ్యాను. అయినవారికి కష్టమనిపించి ఈ స్కూల్ జాయిన్ చేశారు. సహచర విద్యార్థులతో ఆనందంగా ఉన్నా.

–అర్సి సాయిధలక్ష్మి, అంధ విద్యార్థి, యర్రవరం, ఏలేశ్వరం మండలం

ఎంతో ఆనందం



అంగవైకల్యంతో బాధపడేవారి గురించి ఎవరూ పట్టించుకోరు. అందుకనే వికలాంగులకు సేవ చేయాలనే సంకల్పంతో మేము ఈ పాఠశాలను స్థాపించాం. వీరి సేవలో ఎంతో ఆనందం లభిస్తోంది. ఈ పిల్లలు మా పిల్లలతో సమానం. వికలాంగుల సేవ చేయడం దైవ సేవగా భావిస్తున్నాం.

– వీరబాబు సత్య దంపతులు, పాఠశాల నిర్వాహకులు, పులిమేరు

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో ఉన్న స్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో కార్తిక మాసం పంచమి, శనివారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో తెల్లవారు జామున గోపూజ, స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు ఉదయం, సాయంత్రం భక్తులు ఆలయంలో కార్తిక దీపాలను వెలిగించారు. సాయంత్రం స్వామి వారిని అమ్మవార్లను ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు ఆలయంలో లక్షపత్రి పూజలు చేసుకున్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయస్వామికి పూజలు చేసిన భక్తులు

సామర్లకోట: స్థానిక 28వ వార్డులో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ రెడ్నం సునీత, రెడ్నం దొరబాబు దంపతుల ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అర్చకులు సూర్యనారాయణశర్మ ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. శ్రీలం బుజ్జి, శ్యామల దంపతుల విరాళంతో ఆరు అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట: స్థానిక అంబటివారి తోటలోని బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకొని అభిషేక శివలింగ దివ్య దర్శనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మాజీ కౌన్సిలర్ గంగిరెడ్డి కృష్ణమూర్తి, నక్కా జానకిరామయ్య తదితరులు పాల్గొన్ని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రతి రోజు రాజయోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన శ్రీబాలా త్రిపుర సుందరి సమేత కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి దీపారాధన సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన ఎంతగానో ఆకట్టుకుంది. పంచారామ క్షేత్రంలో లక్షపత్రి పూజలు చేసుకున్న భక్తులు ఆలయంలో దీపాలను వెలిగించారు. అంతకు ముందు ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపానికి దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించగా ఆలయ పండితులు ఆకాశ దీపం వెలిగించారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన

పెద్దాపురం: మండలంలోని ఏ గ్రామంలోనైనా సంపద తయారీ కేంద్రాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని పెద్దాపురం మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ హెచ్చరించారు. మండలంలోని కట్టమూరు, కాండ్రకోట సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కట్టమూరు సంపద తయారీ కేంద్రం వద్ద డంపింగ్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పంచాయతీ సిబ్బందిపై మండిపడ్డారు. సత్వరమే డంపింగ్ చెత్త రోడ్లపై లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. షెడ్ నిర్మాణాలకు అవసరమైన నిధులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని రాజశేఖర్ అన్నారు. ఆయన వెంట సచివాలయ కార్యదర్శి రాధాకృష్ణ, గ్రామ ఉప సర్పంచ్ బండారు చంటిబాబు, నల్లల గోవిందు తదితరులున్నారు.

ఉత్సాహంగా దిశ-2023 కార్యక్రమం



విజేతలైన విద్యార్థులతో అతిథులు, డైరెక్టర్లు

పెద్దాపురం: స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్(దిశ- 2023) శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్ ప్రకాష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన దిశ-2023 సమావేశానికి ముఖ్య అతిథిలుగా హాజరైన సబ్ మెరెన్ మాజీ కెప్టెన్ నందకుమార్ దాస్, వెల్ బీయింగ్ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ నీలమ్ తండన్ (న్యూఢిల్లీ) మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి మానసిక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ దిశ కార్యక్రమాన్ని శ్రీ ప్రకాష్‌లో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సంతానం ప్రిన్సిపాల్ ఎంవీఎస్ మూర్తి, అకడమిక్ అండ్ కల్చరల్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.